# శోకసంద్రంలో మల్లెవానికుంట

**రోడ్డు ప్రమాదాల్లో ఉమ్మడి కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం**

- బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తి, యువకుడు మృతి
- మృతుడిని చూసేందుకు ఆటోలో వెళ్తూ ప్రమాదానికి గురై మరో నలుగురు మృత్యువాత.. ముగ్గురికి తీవ్ర గాయాలు

దట్టమైన పొగ మంచు కారణంగా జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం చెందారు. ఇందులో ఒకే కుటుంబానికి చెందిన వారు ఐదుగురు ఉన్నారు. దీంతో పెద్దవూర మండలంలోని నిమ్మనాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లెవాని కుంట, పూల్య తండాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

– పెద్దవూర/ నిడమనూరు, డిసెంబర్ 25

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం మల్లెవాని కుంట తండాకు చెందిన రమావత్ శివకేశవులు (20) ఇంటర్ చదివి ఫ్లవర్ డెకరేషన్ నేర్చుకొని కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లాలో రోజువారీ కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం స్వగ్రామంలో దత్తాత్రేయ స్వామి పండుగ ఉండడంతో ఆదివారం సాయత్రం పని ముగించుకొని బైక్‌పై ఇంటికి బయల్దేరాడు. రాత్రి సుమారు 11గంటల సమయంలో నిడమనూరు మండలం వేంపాడు స్టేజీ వద్ద దుకాణం నిర్వహిస్తున్న వేంపాడు గ్రామస్తుడు బల్గూరి సైదులు (60)ను పొగమంచు కారణంగా కనపడక ఢీకొట్టాడు. దీంతో సైదులు అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ 50 మీటర్ల దూరం వెళ్లి రోడ్డు వెంట ఉన్న దుకాణాన్ని ఢీకొని పడిపోయింది. దీంతో శివ తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయం తెలుసుకున్న పోలీసులు 108 వాహనంలో మిర్యాలగూడ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయాడు. హైదరాబాద్‌లో ఉన్న శివకేశవులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియడంతో తన బంధువు రమావత్ పాండు టాటా ఏస్ వాహనాన్ని తీసుకొని హుటాహుటిన బయల్దేరారు. మల్లెవానికుంటలో కొంత మంది కుటుంబ సభ్యులను దించి అదే ఆటోలో ఉమ్మడి కుటుంబానికి చెందిన ఏడుగురు మిర్యాలగూడ దవాఖానకు బయల్దేరారు. మార్గమధ్యలో నిడమనూరు మండలంలోని వేంపాడు గ్రామ శివారులోని సాయిబాబ విగ్రహం దగ్గరకు రాగానే.. ఎదురుగా వేగంగా వచ్చిన పెట్రోల్ ట్యాంకర్ పొగ మంచుతో అదుపు తప్పి టాటా ఏస్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివకేశవులు పెద్దనాన్న రమావత్ ఘన్యా (40), మేనత్త మూడావత్ బుజ్జి (38), బావ దూపావత్ నాగరాజు (28), పూల్యాతండాకు చెందిన దగ్గరి బంధువు ఆటో డ్రైవర్ రమావత్ పాండు (28) అక్కడికక్కడే మృతి చెందారు. శివకేశవులు తండ్రి రమావత్ ప్రభాకర్, పెదనాన్న కొడుకు రమావత్ వినోద్, మేన మామ మూడావత్ పాలేకర్ తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని చికిత్స నిమిత్తం పోలీసులు మిర్యాలగూడ ఏరియా దవాఖానకు తరలించారు. ఉమ్మడి కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందడంతో మల్లెవానికుంట, పూల్య తండాలు శోక సంద్రంలో మునిగిపోయాయి. కాగా, ఆటో డ్రైవర్ పాండుకు ఇద్దరు భార్యలు, 3 పిల్లలు ఉన్నారు. వారు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. మృతులందరూ హైదరాబాద్‌లో రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటంబసభ్యులు

### పోలీసుల అప్రమత్తం

టాటా ఏస్ వాహనాన్ని పెట్రోల్ ట్యాంకర్ ఢీకొనడంతో కోదాడ – జడ్చర్ల హైవేపై తెల్లవారుజామున ట్రాఫిక్ స్తంభించింది. దట్టమైన పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే పరిస్థితి లేకపోవడంతో అప్రమత్తమైన ఎస్‌ఐ జె.గోపాల్‌రావు జేసీబీ సాయంతో ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డు పక్కకు తీయించారు. ప్రమాదాలు జరుగకుండా పోలీసు సిబ్బందితో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

### సైదులుది నిరుపేద కుటుంబం

బైక్ ప్రమాదంలో దుర్మరణం చెందిన బల్గూరి సైదులు (60)ది నిరు పేద కుటుంబం. భార్య మృతి చెందడంతో తన ముగ్గురు పిల్లలను అన్నీ తానై పెంచాడు. వేంపాడు స్టేజీ వద్ద చిరు దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి సుమారు 11గంటల సమయంలో నిద్ర లేచిన ఆయన మూత్ర విసర్జన చేసి రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సైదులు మరణ వార్త తెలిసి వేంపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే సైదులు మృతి చెందడంతో గ్రామస్తులు కంటతడి పెట్టారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

### మాజీ మంత్రి జానారెడ్డి పరామర్శ

మల్లెవానికుంట తండాలో మృతుల కుటుంబాలను మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాంచందర్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు.



కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

## కమ్యూనిటీ హాల్ ప్రహరీ పనులు ప్రారంభం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 25 : మండలంలోని వీరవెల్లిలో ఎంపీ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ నరాల నిర్మల, ఎంపీటీసీ కంచి లలిత, సర్పంచ్ కల్పనాశ్రీనివాస్‌చారి, ఉప సర్పంచ్ కమలమ్మ, వార్డు సభ్యులు కంచి మహేశ్, రేగు శ్రీశైలం, నాయకులు ప్రమోద్‌కుమార్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, నానం కృష్ణ పాల్గొన్నారు.

## ఆటో దగ్ధం

భువనగిరి అర్బన్, డిసెంబర్ 25 : గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించడంతో ఆటో దగ్ధమైన ఘటన మండలంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాజ్‌పూర్‌కు చెందిన బొమ్మారపు రామకృష్ణ ఆటోను నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఆటోను ఇంటివద్దనే ఉంచాడు. సోమవారం 12.45 గంటలకు శబ్దం రావడంతో రామకృష్ణ తల్లి పద్మ లేచిచూడగా ఆటో కాలిపోతుంది. విషయాన్ని రామకృష్ణకు తెలుపగా మంటలకు ఆర్పాడు. అప్పటికే ఆటో పైభాగం పూర్తిగా కాలిపోయింది. బాధితుడు భువనగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వంగపల్లి గ్రామానికి చెందిన జోగు చంద్రయ్య(45) శనివారం సాయంత్రం వ్యవసాయ క్షేత్రానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హైదరాబాద్‌కు చెందిన కారులో ఢీకొట్టింది. చంద్రయ్యకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేశ్ తెలిపారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, డిసెంబర్ 25 : మున్సిపాలిటీపరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం రాత్రి చౌటుప్పల్ మున్సిపాలిటీ కార్యాలయంలో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో సమీక్షలో ఆయన మాట్లాడారు. కాగా సమీక్షా సమావేశానికి వెళ్లిన మీడియా ప్రతినిధులను మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు బయటకు వెళ్లాలని సూచించడంతో తమను అవమానించారని కార్యాలయం ఎదుట జర్నలిస్టులు నిరసనకు దిగారు. అనంతరం చైర్మన్ సమావేశంలో సరిపడా స్థలం లేకపోవడంతో బయటకు వెళ్లాలని సూచించానని, మీడియా ప్రతినిధులకు ఇబ్బంది కలిగిస్తే క్షమించాలని వివరణ ఇచ్చారు.

## గంజాయి స్వాధీనం

యాదగిరిగుట్ట, డిసెంబర్ 25 : గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని యాదగిరిగుట్ట పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పాతగుట్ట చౌరస్తా వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా పప్పు కుమార్ బల్మికి బైక్‌పై అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు ఆపారు. తనిఖీ చేయగా 129 గ్రాముల గంజాయి పట్టుబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## సామగ్రి దగ్ధం

అడవిదేవులపల్లి, డిసెంబర్ 25: మండలం లోని జిలకరకుంటతండాలో ఆదివారం రాత్రి 12గంటల సమయంలో విద్యుదాఘాతంతో ఇంట్లోని సామగ్రి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రావత్ మాత్రు కుటుంబం ఆదివారం రాత్రి చర్చికి వెళ్లింది. ఫ్రిజ్ షార్ట్ సర్క్యూట్ అయి ఇంట్లో దుస్తులు, వస్తువులు కాలిపోయాయి.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

- దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్

చందంపేట, డిసెంబర్ 25 : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలూనాయక్ అన్నారు. మండలంలోని కంబాలపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన మహాలక్ష్మమ్మ జాతరలో ఎమ్మెల్యే బాలూనాయక్ మహాలక్ష్మమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. అనంతరం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, ఎంపీపీ పార్వతి, జడ్పీ టీసీ లచ్చిరాంనాయక్, మున్సిపల్ చైర్మన్ నర్సింహా, ఎంపీపీ జాన్‌యాదవ్, వెంకటయ్యగౌడ్, బిక్కునాయక్, పాపానాయక్, బద్యానాయక్, కృష్ణయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

## ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

భొ్రాయిబజార్, డిసెంబర్ 25 : ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు జిల్లా కేంద్రంలోని వార్డుల్లో జరిగే ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి, జడ్పీ సీఈఓ సురేశ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు అధికారులు, అంగన్‌వాడీ, మెప్మా, రెవెన్యూ, ఎలక్ట్రికల్, పోలీసుశాఖతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని 48వార్డుల్లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. దరకాస్తులను నింపి ఎనిమిది రోజుల్లో ఏదో ఒక రోజు వార్డులో జరిగే సభల్లో అందించి రశీదు పొందాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సంబంధిత దరకాస్తును ఆన్‌లైన్‌లో పొందుపర్చడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో తాసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, సీఐ రాజశేఖర్, రూరల్ సీఐ అశోక్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఏడీఈ శ్రీనివాస్, మున్సిపల్ ఈఈ ప్రసాద్, మెప్మా పీడీ రమేశ్ నాయక్, డీఈ సత్యారావు పాల్గొన్నారు.